క్లుప్తంగా

పోస్టర్ల ఆవిష్కరణ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ముస్లిం మైనారిటీలకు ఎన్నికల మేనిఫెస్టోలో ఆచరణీయమైన వాటిని మాత్రమే చేర్చాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కెసీ బాదుల్లా పేర్కొన్నారు. శనివారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఎన్నికల మేనిఫెస్టోలో ముస్లిం మైనార్టీలకు సంబంధించిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు సబ్ ప్లాన్ రూపొందించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అమలు అయ్యేటట్లు చూడాలన్నారు. ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేసి వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. గౌస్, నాయకులు దస్తగిరి, వీరన్న, షామీర్‌బాష పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్ : ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభంకానున్న పదవ తరగతి మూల్యాంకన కేంద్రంలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు మెరుగైన వసతులను కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి కోరారు. ఈ విషయమై శనివారం డీఈఓ మర్రెడ్డి అనురాధను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులకు చల్లని మంచినీటితో పాటు ఫ్యాన్లను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మహిళా ఉపాధ్యాయులకు సరిపడా మరుగుదొడ్లు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాలన్నారు. 58 సంవత్సరాల పైబడిన ఉపాధ్యాయులకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాష, శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ గురయ్య, జిల్లా కార్యదర్శులు నరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, రామసుధాకర్, మస్తాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ సొమ్ము లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : కడప నగరం గడ్డి బజారులోని శ్రీ సోమసుందరేశ్వర స్వామి ఆలయ హుండీ సొమ్మును శనివారం లెక్కించారు. దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి వి.సురేష్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో కడప గ్రూపు ఆఫ్ టెంపుల్స్ ఈవో ఎ. శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గత ఆగస్టు 28 నుంచి ఇప్పటి వరకు హుండీలో మొత్తం రూ.44,330 లభించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆఫర్లతో చీరలు



మా జ్యువెలరీ అండ్ డిజైనర్ ప్రదర్శనలో చీరల కొనుగోలు చేస్తున్న మహిళలు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరంలోని ప్రకాశ్ నగర్‌లో మా జువెలరీ డిజైనర్స్‌లో ఉగాది ప్రత్యేక ఆఫర్లతో చీరల అమ్మకాలను ప్రారంభించామని కార్యనిర్వాహకులు కృష్ణారెడ్డి, స్వప్న తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఉగాది స్పెషల్ షో సందర్భంగా మూడు రోజులు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కాటన్ శారీస్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఖాదీ, సాఫ్ట్, కంచి పల్లవి, మీనా, కరిష్మా ప్రింటెడ్, బెంగాలీ, మల్‌మల్, నారాయణపేట కాటన్ శారీస్‌ను అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా గంగమ్మ జాతర

కడప కల్చరల్ : కడప నగరం పాలెంపల్లె గ్రామంలోని రూకవారి పల్లెలో వెలసిన శ్రీ గంగమ్మ తల్లి దేవాలయం జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ పాలెంపల్లి జయభారత్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు మహాజన సభ సమావేశం

కడప కల్చరల్ : మహాజన సభసమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కడప జిల్లా ఎన్‌జీవోల సహకార గృహ నిర్మాణ సంఘం పాలక వర్గం ప్రతినిధి తెలిపారు. సహకార సంఘాల చట్టం ప్రకారం ప్రతి ఆరు నెలలకు ఒకసారి సభ నిర్వహించాల్సి ఉందన్నారు. కడప నగర పరిధిలోని ఆర్టీసీ వర్క్‌షాప్ వద్దగల శాటిలైట్ సిటీలో ఈ సమావేశం ఉంటుందన్నారు. ఇందులో గత సంవత్సరం సెప్టెంబరు 1 నుంచి ఈ సంవత్సరం ఫిబ్రవరి 29 వరకు జమా ఖర్చుల గురించి ఆమోదించడం, ఇతర విషయాలను చర్చిస్తామని తెలిపారు.

ఉత్సాహ భరితంగా రన్ ఫర్ జీసెస్



రన్ ఫర్ జీసెస్ ర్యాలీని ప్రారంభిస్తున్న బిషప్ ఐజాక్ వర ప్రసాద్



ర్యాలీలో పాల్గొన్న విశ్వాసులు

ప్రారంభించిన సీఎస్ఐ బిషప్

కడప కల్చరల్ : పాపుల రక్షణ కోసం శిలువపై ప్రాణ త్యాగం చేసి త్యాగానికి మారుపేరుగా నిలిచిన దైవ కుమారుడు క్రీస్తు మహిమను ఘనపరిచేందుకు అంతా కలిసికట్టుగా ఆయన చూపిన బాటలో పయనిద్దామని సీఎస్ఐ డయాసిస్ దక్షిణ ప్రాంత పీఠాధిపతి రైట్ రెవరెండ్ బిషప్ ఐజాక్ వర ప్రసాద్ పిలుపునిచ్చారు.

గుడ్‌ఫ్రై డే కార్యక్రమాల్లో భాగంగా రెండవరోజు శనివారం ఉదయం కడప నగరంలోని సీఎస్ఐ సెంట్రల్ చర్చి వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. సీఎస్ఐ విచారణ గురువులు, విశ్వాసులతో కలిసి రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని ఆకుపచ్చ జెండాఊపి ప్రారంభించారు.

చర్చి కమిటీ ప్రతినిధులు మనోహర్ బాబు, డానియెల్ తదితరుల ఆధ్వర్యంలో తెల్లని టీ షర్టులు, టోపీలతో పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్న ఈ రన్‌లో అడుగడుగునా రన్ ఫర్ జీసెస్ అంటూ నినాదాలు చేస్తూ తమ పరుగుతో నగరమంతటా సందడి చేశారు. కడప నగరంలోని ప్రముఖ కూడళ్ల ద్వారా సాగిన పరుగు మళ్లీ చర్చికి చేరింది. రాత్రి దాదాపు అన్ని చర్చిల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శనివారానికి 40 రోజుల లెంట్ డేస్ (శోక దినాలు) పూర్తి కావడంతో ఆదివారం ఈస్టర్ సండేని ఘనంగా నిర్వహించేందుకు చర్చి కమిటీ సభ్యులు, గురువులు సిద్ధమయ్యారు. ఇందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం తెల్లవారుజామున 5 నుంచి 7 గంటల్లోగా ప్రార్థనలు నిర్వహించనున్నారు.

తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలి



అధికారులతో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : వేసవి కాలంలో కడప నగర ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్ ఆదేశించారు. శనివారం మైలవరం డ్యామ్ నుంచి విడుదలైన నీటిని ఉప్పరపల్లి కెనాల్ వద్దకు వెళ్లి పరిశీలించారు. వేసవికాలంలో నీటి కొరత రాకుండా ప్రజలకు నీరందించాలన్నారు. రాళ్లవంక, బచ్చుంపల్లి వాటర్ గండి ప్రాంతాలను పరిశీలించారు. నీరు లింగంపల్లికి చేరేలా కెనాల్స్‌లో ఉన్న మట్టిని జేసీబీ, హిటాచి, డోజర్లతో తొలగించాలన్నారు. మైలవరం నుండి నీటి ప్రవాహ ప్రాంతమును డ్రోన్ కెమెరాల ద్వారా చిత్రీకరించవలసిందిగా అధికారులను ఆదేశించారు. గండి నుండి లింగంపల్లి వరకు నీటి ప్రవాహానికి ట్రెంచ్ ఏర్పాటు చేయాలన్నారు. నాలుగు రోజుల్లో లింగంపల్లికి చేరుకునేలా గండి వాటర్ వర్క్స్ వరకూ షీట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రత్నాల రాజు, డీఈలు కరిముల్లా ఖాన్, రాజేష్, వేణుగోపాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో ప్రస్తుతం ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ అధికారులు మజ్జిగ కేంద్రాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివ కుమార్ కోరారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోజు రోజుకీ ఎండల తీవ్రత పెరుగుతూ వస్తోందన్నారు. ఎండలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటువంటి తరుణంలో ప్రభుత్వ అధికారులు జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మజ్జిగ కేంద్రాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

బకాయిలను చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తామన్న బకాయిలను వెంటనే చెల్లించాలని ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి సత్యానారాయణ డిమాండ్ చేశారు. శనివారం కడపలోని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య అధ్యక్షతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పదవ తరగతి మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు వసతులను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీకి ఓటమి ఖాయం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమని ఏపీసీసీ మైనార్టీ విభాగపు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ ఆలీఖాన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రోరల్ బాండ్ల కుంభకోణం భయం భారతీయ జనతా పార్టీని వణికిస్తోందని, ఎన్నికల్లో ఆ పార్టీకి పరాజయం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. వెంకటరమణారెడ్డి, ఓబీసీ జిల్లా చైర్మన్ కులాయప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నగర కమిటీల నియామకం

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కడప నగర ఎస్సీ విభాగం, డాక్టర్ల విభాగం, యువజన విభాగం, విద్యార్థి విభాగ కమిటీలను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలిలా ఉన్నాయి.

- వైఎస్సార్‌సీపీ నగర యువజన విభాగం అధ్యక్షుడిగా దేవిరెడ్డి ఆదిత్య, ఉపాధ్యక్షులుగా ఎం. సుధీర్, ఎస్. సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శులుగా ఎస్. మైను, వై. రవి, పి. సద్దాం, జి. పోతన్, బి. చిన్న ఓబయ్య, ఎం.మురళీక్రిష్ణలతోపాటు సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు కలిపి మొత్తం 33 మందితో కమిటీ నియమించారు.
- నగర ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా కంచుపాటి బాబు, ఉపాధ్యక్షులుగా జె. వెంకట రమణయ్య, జి. రాజా రత్నం, ప్రధాన కార్యదర్శులుగా ఎం. రవిశంకర్, బి. ప్రేమ్ కుమార్, డి. సాయి క్రిష్ణ, ఎస్. నరసింహ సాయి, టి. అజయ్, వి. రామాంజనేయులు తోపాటు కార్యదర్శులు, జాయింట్ సెక్రటరీలను కలిపి మొత్తం 33 మందితో కమిటీ నియమించారు.
- నగర డాక్టర్ల విభాగం అధ్యక్షుడిగా డా. పి. సతీష్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా డా. ఎంవీ పవన్ కుమార్ రెడ్డి, డా. అరుణ జ్యోతి, ప్రధాన కార్యదర్శులుగా సుమన్, ఎస్. జాబీర్, వెంకట నారాయణ, ఎం. మురళీ క్రిష్ణ, ఆర్ నాగసురేంద్ర, ఎస్. శివశంకర్‌లతో పాటు సెక్రటరీ, జాయింట్ సెక్రటరీలను నియమించారు.
- విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడిగా బి. సందీప్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వై. శ్రీకాంత్‌రెడ్డి, ఎం. మన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఏ. విష్ణురెడ్డి, ఎం. శశికుమార్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, బి. గుణశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఏ. సాయిరెడ్డిలతోపాటు సెక్రటరీ, జాయింట్ సెక్రటరీలను నియమించారు.

తల్లిదండ్రులకు అప్పగిస్తాం

రైల్వే సీఐ నాగార్జున



విద్యార్థులతో రైల్వే పోలీసులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : తెలంగాణా రాష్ట్రానికి చెందిన బండ్లగూడ నాగారం గ్రామంలోని బీసీ హాస్టల్‌లో కావలి వరుణ్, కావలి శివకుమార్, నందకిశోర్ అనే ముగ్గురు విద్యార్థులు 9వ తరగతి చదువుతున్నారని, హాస్టల్‌లో ఉపాధ్యాయులు మందలించారని పారిపోయి హజరత్ నిజాముద్దీన్ ట్రైన్‌లో కాచీగూడలో ట్రెన్ ఎక్కారని సమాచారం రావడంతో శనివారం సాయంత్రం వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలో ఆ ముగ్గురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నామని కడప రైల్వే సీఐ నాగార్జున తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు ఈ ముగ్గురు విద్యార్థులు పారిపోయారన్న సమాచారంతో తల్లిదండ్రులు కీసర పోలీస్ స్టేషన్‌లో 223/24 మిస్సింగ్ కేసు నమోదు చేశారన్నారు. కీసర ఎస్ఐ ఇచ్చిన సమాచారం మేరకు కడప జీఆర్‌పీ/ఆర్‌పీఎఫ్ పోలీసులు శనివారం సాయంత్రం ట్రెన్‌లో సోదాలు చేయగా ముగ్గురు విద్యార్థులనీ అదుపులోకి తీసుకుని తల్లిదండ్రులకు సమాచారం అందించామని, వారు వచ్చిన వెంటనే విద్యార్థులను అప్పగించనున్నట్లు చెప్పారు. గుంతకల్లు రైల్వే ఎస్పీ చౌడేశ్వరి సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి



వెల్లటూరులో కవాతు నిర్వహిస్తున్న సీఐ నాగరాజు, కేంద్ర బలగాలు

పెండ్లిమర్రి : త్వరలో జరగన్ను సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కడప రూరల్ సీఐ నాగరాజు తెలిపారు. శనివారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన కొండూరు, ఉలవలపల్లె, వెల్లటూరు గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామన్నారు. ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నిలు జరిగేలా చుస్తామని ప్రజలకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

మీకు లబ్ధి చేకూరితేనే జగనన్నకు ఓటేయండి



కమలాపురం 5వ వార్డులో ప్రచారం చేస్తున్న డాక్టర్ రమ్యతారెడ్డి

కమలాపురం : వైఎస్సార్ సీపీ పాలనలో మీ కుటుంబానికి లబ్ధి చేకూరితేనే జగనన్నకు ఓటేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కుమార్తె డాక్టర్ రమ్యతారెడ్డి ప్రజలను కోరారు. శనివారం కమలాపురం పట్టణంలోని 4, 5వ కౌన్సిల్ వార్డుల్లో ఆమె ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఆమె రాకను పురస్కరించుకుని మహిళలు హారతులు పడుతూ స్వాగతం పలికారు. ఆమె ప్రతి ఇంటి తలుపు తట్టి ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో జగనన్న పాలనలో ప్రజలకు జరిగిన మేలును వివరించారు. మీ కుటుంబానికి వైఎస్సార్ సీపీ పాలనలో మేలు జరిగితేనే జగనన్నకు ఓటు వేయాలని కోరారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిందన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనన్నకు ఓటేసి మరో సారి సీఎంగా గెలుపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, దేవదానం, నిఖిల్‌రెడ్డి, గురు దీపిక, జెట్టి నగేష్, ఎన్‌సీ పుల్లారెడ్డి, గంగాధర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఇస్మాయిల్, సాదిక్, శ్రీనివాసరెడ్డి, ఇర్ఫాన్, మస్తానయ్య, కొండారెడ్డి పాల్గొన్నారు.

ఏకాగ్రత సాధనకు తస్బీ

- పెరిగిన వినియోగం
- పలు రకాలతో మార్కెట్లు కళకళ



వివిధ రకాల తస్బీలు

కడప కల్చరల్ : ముస్లింలు రంజాన్ మాసాన్ని పూర్తిగా ఆధ్యాత్మిక చింతనతో గడుపుతారు. జీవితంలో ఈ మాసం ఎంతో ఉత్తమమైనదని, నిరంతరం దైవ నామ స్మరణతో గడిపేందుకే కృషి చేస్తారు. దైవ నామ స్మరణలో 'తస్బీ' ప్రధానపాత్ర వహిస్తోంది. తస్బీ అంటే రుషులు, మునులు ధ్యానంలో ఉంటూ జపం చేసేటపుడు చేతిలో ఉంచుకునే జపమాల లాంటిది. ముస్లిం పెద్దలు, వృద్ధులు, గురువులు, ఆధ్యాత్మిక చింతన గలవారు ఎక్కువగా తస్బీని చేతిలో ఉంచుకుని దైవ నామ స్మరణతో గడుపుతూ ఉంటారు. ఇటీవలి కాలంలో యువకులు, మహిళలు, విద్యార్థులు కూడా నిరంతరం ఖురాన్ పఠనం చేస్తున్నారు. సాధారణంగా ఫజర్, అసర్, మగ్రీబ్ నమాజుల అనంతరం నేటికీ కొద్దిసేపు పవిత్ర ఖురాన్ పఠనం కొనసాగుతోంది.

పవిత్రత చేకూరుస్తూ..

రంజాన్ మాసంలో ఖురాన్ పఠనం చేసే వారితో పాటు మౌనంగా దైవ నామస్మరణ చేసేవారు ఎక్కువగా తస్బీని ఉపయోగిస్తుంటారు. కొందరు మాల లాగా మెడలో ధరిస్తే మరికొందరు చేత్తో పూసలను లెక్కిస్తూ పఠనం కొనసాగిస్తారు. ఐదేళ్లుగా వివిధ రకాల స్థానిక భాషల్లో ఖురాన్ అందుబాటులోకి రావడంతో అప్పటి నుంచి తస్బీని కూడా రకరకాలుగా మార్కెట్‌కు చేరుతున్నాయి. తొలుత కేవలం కొయ్య (చెక్క)తో తయారు చేసిన లేదా ముత్యాలతో రూపొందించిన తస్బీలను అది కూడా ఆకుపచ్చ రంగు తస్బీలనే ఉపయోగించేవారు. ఇటీవలి కాలంలో కొయ్య, ముత్యాలతోపాటు చందనం కొయ్య, క్రిస్టల్, రేడియం తదితర పూసలతో చేసిన తస్బీలు కూడా లభిస్తున్నాయి. ఎక్కువగా రేడియం పూసలతో చేసిన వాటికే ఆదరణ ఉన్నట్లు సమాచారం.

విధానం - సాధారణ తస్బీలో 33+33+34 =100 పూసలు ఉంటాయి. 500 పూసలు గల తస్బీలు కూడా ఉన్నాయని, కానీ జిల్లాలో వాటిని వాడే వారు తక్కువని వ్యాపారులు చెబుతున్నారు. వంద పూసల తస్బీలలో 33 మార్లు 'సుభాన్ అల్లాహ్' అని, మరో 33 సార్లు 'అల్‌హందులిల్లా' అని, 34 మార్లు 'అల్లాహు అక్బర్' అంటూ ఉచ్చరిస్తూ (లేదా మనసులో అనుకుంటూ) తస్బీలోని వంద పూసలను లెక్కిస్తారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో మాజీ శాసన మండలి ఉపాధ్యక్షుడు ఎస్‌వీ సతీష్ కుమార్ రెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్ / కడప ఎడ్యుకేషన్ : పవిత్ర రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక అని మాజీ శాసన మండలి ఉపాధ్యక్షుడు ఎస్‌వీ సతీష్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం కడప నగర శివార్లలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో కళాశాల చైర్మన్ ఏక్యూ జవ్వాద్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్‌వీ సతీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కడప నగరం మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ఈ మాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఎంతో పుణ్య కార్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ ముర్తజా, కళాశాల వైద్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే దేశాభివృద్ధి

వైవీయూ వీసీ ఆచార్య సుధాకర్



ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

కడప ఎడ్యుకేషన్ : సైన్సుతోనే దేశం అభివృద్ధి చెందుతుందని, ఇందుకు సైన్సు ఎగ్జిబిట్స్ ఎంతగానో ఉపకరిస్తాయని యోగివేమన విశ్వవిద్యాలయ వైస్ చాన్సులర్ ఆచార్య చింతా సుధాకర్, జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డి అన్నారు. శనివారం కడప వివేకానందనగర్‌లోని శ్రీసాయి విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో కరస్పాండెంట్ మైథిలి, డైరెక్టర్ భూపతిల ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై సైన్సు అండ్ ఆర్ట్ ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ నేటి సాంకేతికతను ప్రతి విద్యార్థి అందుకుని సైన్సు పరంగా అభివృద్ధి చెంది దేశానికి సేవలందించాలన్నారు. వైవీయూ అసోసియేట్ ప్రొఫెసర్ వెంకటరమణ, ఏపీ డిజిటల్ ఇన్‌చార్జు రెహమాన్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్‌ను వారు పరిశీలించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రారంభమైన శ్రీ చౌడేశ్వరీదేవి ఉత్సవాలు

వల్లూరు : మండలంలోని వెంకటాపురం వీవర్స్‌కాలనీలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆలయంలో తెల్లవారు జామున ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం గ్రామంలో చల్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సరిహద్దుల్లో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కాయ కర్పూరాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారి అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాయంత్రం బిందె సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు గ్రామంలోని గంగమ్మ ఆలయం వద్దకు మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవంగా వెళ్లి పూజలు నిర్వహించారు.

అనంతరం గంగకు పూజలు నిర్వహించి బిందెలతో నీటిని తీసుకుని చౌడేశ్వరీ మాత ఆలయానికి చేరుకున్నారు. జ్యోతులను మొక్కుబడుల రూపంలో సమర్పించడానికి సిద్ధమైన భక్తులు అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి ఆ జలంతో జ్యోతుల తయారీని ప్రారంభిచారు.

సంక్షేమ పాలన కావాలంటే మళ్లీ జగనే సీఎం కావాలి



ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : రాష్ట్రంలో తిరిగి సంక్షేమ పాలన సాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పదవి బాధ్యతలు చేపట్టాలని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులు రెడ్డిలు అన్నారు. శనివారం మండలంలోని మూలవంక, ఏఎల్ కాలనీ, బయనపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించగా, కమ్మవారిపల్లి పంచాయతీ పరిధిలో కమ్మవారిపల్లి, కమ్మవారిపల్లి దళితవాడ, మిట్టమీదపల్లి, తురకపల్లి గ్రామాల్లో పి.నరేన్ రామానుజులురెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వేయించి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 14 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు ఏ ఒక్క వర్గానికి కూడా న్యాయం చేసిన దాఖలాలు లేవన్నారు. వెన్నుపోటు పొడవడంలో చంద్రబాబుకు మించిన నాయకుడులేరని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తిరిగి సంక్షేమ పాలన, అభివృద్ధి కార్యక్రమాలు జరగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళ యాదవ్, మాజీ మండల కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, మండల నాయకులు కమలకూరి శ్రీనివాసుల రెడ్డి, రామాంజనేయులు, సుబ్బిరెడ్డి, సర్పంచులు బాబయ్య, వర్దిరెడ్డి సురేంద్రరెడ్డి, ఎంపీటీసీలు నారే నాగరాజు, వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ లక్కిరెడ్డి రమణారెడ్డి, నీలకంఠారెడ్డి, అప్ప నాయక్, సేవాదల్ అధ్యక్షుడు సిద్దు, మండల యూత్ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

అట్లూరు: మండల పరిధిలోని కడప-బద్వేలు ప్రధాన రహదారిపై అట్లూరు క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్లపల్లి వినోద్ (23) అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు బి.మఠం మండలం వాంపల్లెచెరువు గ్రామానికి చెందిన వినోద్ తన భార్యను చూసేందుకు ద్విచక్ర వాహనంపై ఒంటిమిట్టకు వెళుతుండగా సిద్దవటం పెన్నానది నుంచి ఇసుకలోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వినోద్‌ను 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.